

జిల్లాలోకి యథేచ్ఛగా.. దేశీదారు



● రైళ్ల ద్వారా అక్రమ రవాణా ● స్థానిక మద్యం విక్రయాలపై ప్రభావం
● దృష్టి సారించిన ఎక్సైజ్ అధికారులు

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర కేంద్రంగా దేశీదారు దందా కొనసాగుతోంది. మహారాష్ట్రకు సరిహద్దునే ఉన్న ఆసిఫాబాద్ జిల్లాలోని చాలాగ్రామాల్లో ప్రస్తుతం మహారాష్ట్ర దేశీ మద్యాన్ని తరలించి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. అక్కడ తయారు చేస్తున్న దేశీదారు ధర తక్కువగా ఉండటం అధిక మత్తు ఇస్తుండటంతో ఈ దందాకు డిమాండు పెరిగింది. రెండేళ్ల క్రితం వరకు మహారాష్ట్రలో ఇక్కడి వ్యాపారులు ఆడిందే ఆటగా అమ్మిందే మందుగా సాగింది. మహారాష్ట్రలో మద్యపాన నిషేధం ఎత్తివేయటంతో మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నారు. మహారాష్ట్రలో లభించే దేశీదారు కారుచౌకగా లభించటంతో ఈ ప్రాంతానికి ఆసిఫాబాద్, సిర్పూరు మార్గాల గుండా తరలిస్తున్నారు. రోడ్డుమార్గంతోపాటు రైళ్లగుండా తరలించి జిల్లాలో అమ్ముతున్నారు. దీంతో కొంత కాలంగా జిల్లా ఎక్సైజ్ యంత్రాంగం దేశీదారుపై దృష్టిసారించింది. స్మగ్లింగ్ జరుగుతున్న మార్గాలపై గట్టి నిఘాపెట్టింది. అయినప్పటికీ స్మగ్లర్లు ఎక్సైజ్ యంత్రాంగాన్ని బురిడికొట్టించి మరీ జిల్లాలోకి దేశీదారును స్మగ్లింగ్ చేస్తున్నట్టు కనిపెట్టారు.

ఈ నేపథ్యంలోనే ఎక్సైజ్‌శాఖ ప్రతిరోజు ఏదో ఒకచోట దాడులు నిర్వహిస్తోంది. రాష్ట్ర టాస్క్‌ఫోర్సు ఆధ్వర్యంలో ప్రత్యేకనిఘా పెట్టి దాడులు నిర్వహిస్తున్నారు. ఈ దందాను నిర్వహిస్తున్న కొంతమందిని స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నారు. దేశీదారు స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపుతూ భారీగా జరి మానాలు విధిస్తున్నారు. గతేడాది నుంచి జరిగిన దాడుల్లో కొన్నికేసుల్లో ఒక్కొక్కరిపై లక్ష వరకు జరిమానా విధించారు. మహారాష్ట్రలో మద్య నిషేధం పాక్షికంగా సడలించటంతో దాని ప్రభావం జిల్లాలోని మద్యం విక్రయాలపై పడినట్టు ఎక్సైజ్‌వర్గాలు చెబుతున్నాయి. దేశీదారు దందాను అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులు గ్రామాల్లో సమావేశాలను నిర్వహిస్తున్నారు. దేశీదారుతో వచ్చే అనార్థాలను వివరిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మహారాష్ట్ర నుంచి కౌటాల వైపు ఆటోలో తరలిస్తున్న 20పెట్టెల దేశీదారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటివిలువ రూ.1.80లక్ష ఉండగా, ఈ కేసులో ముగ్గురిని అరెస్టుచేశారు. అలాగే కాగజ్‌నగర్ పట్టణంలో గతనెల మొదటివారంలో దేశీదారు అమ్మకాలు చేస్తున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒకరి ఇంటిపై దాడులు చేసి దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. గతంలో ఈ దందాకు పాల్పడిన వారిపై గట్టి నిఘా పెట్టి దేశీదారు జిల్లాలోకి రాకుండా చేస్తున్నారు.

దాడులు చేస్తున్నాం..: రవి కుమార్, ఎక్సైజ్ సీఐ కాగజ్‌నగర్

మహారాష్ట్రలో మద్య నిషేధం ఎత్తివేసినందున దేశీదారు దందా పెరిగింది. ఈ దందాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మహారాష్ట్ర నుంచి రాష్ట్రంలోకి మద్యం ప్రవేశించకుండా గట్టి నిఘా పెడుతున్నాం. ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నాం. ఈ దందాను గతంలో నిర్వహించిన వారిపై నిఘా పెట్టి బైండోవర్ చేస్తున్నాం.



శనివారం కౌటాలలో పోలీసులు పట్టుకున్న దేశీదారు

రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు



మొదటి బహుమతి అందుకుంటున్న ఉమ్మడి జిల్లా జట్టు

ఆసిఫాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మూడురోజులుగా జరుగుతున్న అండర్-14 రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ఉమ్మడిఆదిలాబాద్ జిల్లా జట్టు సత్తాచాటింది. ఆదివారం జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో వరంగల్‌జట్టుపై గెలిచి టోర్నమెంట్ చాంపియన్‌గా నిలిచి క్రీడాపతాకాన్ని ఎగురవేసింది. ఈ సందర్భంగా క్రీడాజట్టుతోపాటు కోచ్‌లు అరవింద్, సాయి, స్ఫూర్తివివేక్‌ను జిల్లాహ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, రమేష్, కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, గిరిజన శాఖ డీడీ రమాదేవి, స్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి, తదితరులు అభినందించారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకు మూడో స్థానం



మూడో స్థానంలో నిలిచిన మహిళల జట్టు

రెబ్బెన, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8నుంచి 10వరకు హనుమకొండ నెహ్రూ స్టేడియంలో జరిగిన అంతర్‌జిల్లాల బాల్ బాడ్మింటన్‌లో పోటీలో ఉమ్మడిఆదిలాబాద్ మహిళల జట్టుకు మూడోస్థానం సాధించిందని బాల్‌బాడ్మింటన్ ప్రధానకార్యదర్శి నారాయణ రెడ్డి తెలిపారు. పోటీలో నల్గొండపై 35-20,36-22 తేడాతో విజయం సాధించినట్టు ఆయన వివరించారు. గెలిచిన జట్టుకు రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎస్‌తిరుపతి, షార్ప్‌స్టార్ బాల్ బాడ్మింటన్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి శంకర్, పీఈటీ భాస్కర్, ఎంచందర్, మల్లేష్, మొగిలి, నరేష్ అభినందించారు.

ఘనంగా కొలావార్ జెండా ఆవిష్కరణ



కొలావార్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బెజ్జూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కొలావార్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం మండలకేంద్రంలోని కొలావార్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొలావార్ జిల్లా యువజన సంఘం కన్వీనర్ సతీష్ మాట్లాడుతూ కొలావార్ సంగం ఏర్పాటుచేసి 29సంవత్సరాలు అయిందన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు పోచయ్య, నాయకులు సంతోష్, బక్కయ్య, మల్లేష్, వెంకటేష్, లలిత, నాగేష్, మధు, సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన అధికారులు



వాంకిడిలో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

వాంకిడి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీవో ఓమర్ పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వ్యక్తిగత, కుటుంబ వివరాలు సేకరించాలన్నారు. వివరాల సేకరణలో నైతిక ప్రమాణాలు పాటించాలని ఆయన కోరారు. సర్వేలో తప్పులుదొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎన్యూమరేటర్ పాల్గొన్నారు.

దహెగాం/సిర్పూర్(టి): మండలవ్యాప్తంగా సమగ్రకుటుంబ సర్వే కొనసాగుతోంది. ఆదివారం మండలాల్లోని గ్రామాలవారీగా చేపడుతున్న సర్వేను ఎంపీడీవోలు పరిశీలించారు. సర్వేలో ఎలాంటి తప్పులు చోటు చేసుకోకుండా జాగ్రత్తగా పూర్తి చేయాలని సూచించారు. సర్వేను ఎంపీడీవోలు సత్యనారాయణ, రాజేందర్ పరిశీలించారు.

సర్వేలో ప్రతి కుటుంబ వివరాలు నమోదు చేయాలి

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేలో జిల్లాలోని ప్రతి కుటుంబం వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదివారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం తుంపల్లి గ్రామంలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేతీరును తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా నమోదుచేయాలని తెలిపారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లలో పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు నిర్ణీతనమునాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. నిర్దేశించిన ఫారంలో ప్రతిఅంశాన్ని ప్రజలవద్ద నుంచి తప్పనిసరిగా సేకరించాలని, అందు బాటులో లేని వారి ఇంటికి మరోకసారి తప్ప నిసరిగా వెళ్లాలన్నారు. ఒక్క కుటుంబం కూడా మినహాయింపుకాకూడదని తెలిపారు. సర్వే ముందురోజు ఏప్రాంతంలో సర్వేనిర్వ హిస్తారో సంబంధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించాలని, సర్వేలక్ష్యాన్ని సాధించాల్సిన బాధ్యత ఎన్యూమరేటర్లపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలి..

జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన అర్హత గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ వెంక టేష్‌దోత్రే అన్నారు. ఆదివారం ఆసిఫాబాద్ మండలం తెంపల్లిలోని ప్రభుత్వప్రాథమిక ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో కొనసాగుతున్న ఓటరునమోదు ప్రత్యేకశిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18సంవత్సరాల వయస్సునిండిన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదుచేయాలని తెలిపారు. భారతఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నూతన ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపునకు ప్రత్యేకశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్థానికసంస్థల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

● బీజేపీ రాష్ట్ర నాయకుడు అరుణ్‌కుమార్



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు అరుణ్‌కుమార్

ఆసిఫాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యశాల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి పదినెలలు దాటినా ఇప్పటి వరకు ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారన్నారు. రాష్ట్రంలో బీజేపీప్రజల మన్ననలను పొందుతూ గతఅసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 8ఎమ్మెల్యేలు, 8ఎంపీలను గెలుపొందిందన్నారు. జిల్లాలో బీజేపీ60వేలకు పైగా సభ్యత్వాలను పూర్తిచేయడం సంతోషంగా ఉందన్నారు. స్థానికఎన్నికల అధికారులు, ఉప రిటర్నింగ్ అధికారులు, మండల ఇన్‌చార్జిలను నియమించారు. సమావేశంలో నాయకులు అమర్‌సింగ్ తిలావత్, సతీష్‌బాబు, కిరణ్, సత్యనారాయణ, అరుణ్‌కుమార్ లోయ, ప్రభాకర్‌గౌడ్, మనోహర్‌గౌడ్, మల్లయ్య, శంకర్, సొల్లు లక్ష్మి, కోవవిజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

● ఇబ్బందులు పడుతున్న రైతులు ● పొలాల్లో, ఇంటివద్ద ఆరబోసుకుంటున్న వైనం



హార్వేస్టర్‌తో వరిని కోయిస్తున్న రైతు

చింతలమానేపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలు జిల్లాలో సిర్పూర్(టి), దహెగాం మండలాల్లో మినహా ఎక్కడా ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఇప్పటికే వరిపొలాల్లో వడ్లను మిషన్ల ద్వారాకోసి ఆరబెట్టి కొనుగోలుకేంద్రాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం సన్నరకంకు రూ.500బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రైతులు వ్యాపారులకు విక్రయించకుండా ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 56వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నది. ఏ గ్రేడ్‌రకానికి క్వింటాలుకు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ కొనుగోలు కేంద్రాల ఆలస్యం కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించక పోవడంపై జిల్లా అధికారి బిక్కురాథోడ్‌ను సంప్రదించగా త్వరలో అన్నిమండలాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే రెండు మండలాల్లో కొను గోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తా మన్నారు.



ధాన్యాన్ని పొలాల్లో కుప్ప పోసిన రైతులు

రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి..
- పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్యే



జిల్లా వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తా. అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం కృషి చేయడంతోపాటు సన్నరకం వడ్లకు అందిస్తున్న రూ.500బోనస్, అలాగే దొడ్డు వడ్లకు కూడా రూ.500బోనస్ అందించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతా. రైతుల సంక్షేమం కోసం కృషిచేస్తాం.

సమగ్ర సర్వేను పక్కాగా చేపట్టాలి

● సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబసర్వేను పక్కాగా చేపట్టాలని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని పలువార్డుల్లో సర్వే చేపడుతున్న సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. అలాగే పూర్తివివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, కమిషనర్ అంజయ్య పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యతు

పెంచికలపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): యువత చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వలభవిష్యత్ ఉంటుందని ఎస్సై కొమురయ్య అన్నారు. ఆదివారం మండలంలోని బొంబాయిగూడ గ్రామంలో శివాజీయూత్ యువకులకు వాలీబాల్ కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో శారీరక ధ్రుడత్వంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు.

ప్రజా సమస్యలపై విస్తృత ఉద్యమాలు నిర్వహించాలి

● సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

కాగజ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై విస్తృత ఉద్యమాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ తెలిపారు. సీపీఐ(ఎం) జిల్లా మూడో మహాసభలో ఆయన మాట్లాడారు. దేశం అనేక ఒడిదుడుకులను సవాళ్లను ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం అధ్యయనం చేసి ఉద్యమాలను నిర్వహించాలన్నారు. బీజేపీ పాల్పడుతున్న మతోన్మాదపు చర్యలని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్రకమిటీ సభ్యుడు బండారు రవి కుమార్, రాష్ట్రనాయకుడు సతీష్‌కుమార్, జిల్లా సీనియర్ నాయకుడు సత్యనారాయణ, కార్యదర్శి కూశన్నరాజన్న, కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, ముంజం శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీకమాస పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కాగజ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఈసుగాం శివమల్లన్న ఆలయంలో భక్తులుపూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా శివలింగానికి క్షీరాభిషేకంచేశారు.కార్యక్రమంలో ఆలయకమిటీసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో..

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లోనిమహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని భక్తులు అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం..



పాఠశాల ప్రహరీపై పెరిగిన చెట్టు

పెంచికలపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరిపై పిచ్చి మొక్క పెరిగి చెట్టుగా మారి ప్రమాదకరంగా తయారయింది. పైన చెట్టుకొమ్మలు విద్యుత్ తీగలను తాకుతూ ప్రమాదకరంగా మారగా. కింద వేర్లు పెరగ డంతో గోడ బీటలు వారి ప్రమాదానికి నిలయంగా మారింది. దీంతో ఏ సమయాన ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపా ధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిని సంప్రదించగా మొక్కను తొలగిస్తామని పేర్కొన్నారు.

మత్తం గోండిగా నమోదు చేయాలి

సిర్పూర్(యు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేలో ఆదివాసీలు కులం కాలంలో తమ కులాన్ని మత్తంగోండిగా నమోదు చేయాలని మహగాం రాయిసంటర్ సార్మెడి ఆత్రం ఆనంద్‌రావు, ఆదివాసీ నాయకుడు ఆత్రం భగవంత్‌రావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోవారు మాట్లాడుతూ ఆదివాసీలు ఈ విషయాని సర్వే అధికారులకు చెప్పి నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కోయపున్నెం గోండి ధర్మం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆత్రం ఆనంద్‌రావు, ఆదివాసీ నాయకులు సేడ్మకి గుణవంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రి టౌన్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, వాట్సాప్‌లో వచ్చే మెసేజ్‌లను క్లిక్ చేయవద్దని మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మందమర్రి మండలం చిర్రకుంటకు చెందిన రాజేందర్ అనే వ్యక్తి అక్టోబరు 9వ తేదీన వాట్సాప్‌లో ఒక మెసేజ్ వచ్చిందన్నారు. అది క్లిక్ చేయగా అతని అకౌంట్ నుండి 50 వేలు పోయినట్లు మెసేజ్ వచ్చిందని, వెంటనే సైబర్ మోసంకు గురైనట్లు తెలుసుకొని 1930 నంబర్‌కు కాల్ చేసి పిర్యాదు చేశాడన్నారు. దీనిపై విచారణ జరుగుతుందని చెప్పారు. ఇలాంటి మెసేజ్‌ల వల్ల సైబర్ నేరగాళ్లు బ్యాంకు వివరాలను తెలుసుకొని డబ్బులు ఖాజేస్తారని తెలిపారు. వాట్సాప్‌తో పాటు ఇతరత్రా మెసేజ్‌లను డిలీట్ చేయాలే తప్ప క్లిక్ చేయవద్దన్నారు. దీనిపై అవగాహణ కల్పించేందుకు సీపీ ఆదేశాల మేరకు కళాశాలలో పాటు ప్రధాన కూడళ్లలో అవగాహన నిర్వహించనున్నట్లు తెలిపారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం

మంచిర్యాల అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ జాతీయ రహదారి సమీపంలో ఆదివారం కారులో మంటలు చెలరేగి దగ్ధమైందని పట్టణ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన పిట్టల రాజేష్ మందమర్రిలో ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు తన కారులో వెళ్తూ రాజీవ్‌నగర్ రహదారి సమీపంలో కారును నిలిపాడు. బహిర్భూమికి వెళ్లిన సమయంలో కారులో నుంచి మంటలు చెలరేగి కాలిపోయింది. మంటలు అంటుకోవడానికి కారణాలు తెలియరాలేదని, రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

నస్పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటోను ముద్రించాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 4,5,6 తేదిలో తలపెట్టిన ఉద్యమాన్ని విజయవంతం చే యాలని అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరుశురామ్ కోరారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో సమితి సలహాదారులు పలిగిరి కనకరాజు, నక్క శ్రీనివాస్, మెయ్య రాంబాబు, సత్యం, పోచం, ఐత పరమేష్, సన్నీని రాజేందర్, రాచర్ల చారేష్, కుమార్ పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు పరశురామ్ అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఛలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నస్పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెటనే విడుదల చేయాలని జాతీయ మానవ హక్కుల సేవా సంఘం, నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధక్షుడు గోదారి వెంకటసాయి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని కోరారు.

పాత మంచిర్యాలలో వైద్య శిబిరం

గర్మిళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత మంచిర్యాలో శ్రీ భగవద్గీత ధ్యాన మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 8,9 వార్డులకు చెందిన ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పెంట రాజయ్య, బొలిశెట్టి సునీతకిషన్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

భీమారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్వేత మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. కుటుంబాల గురించి ఆలోచించి వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు.

కల్లెంపల్లిలో కార్డన్‌సెర్చ్



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

వేమనపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారుమూల గ్రామమైన కల్లెంపల్లిలో ఆదివారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆద్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకే పోలీసులు పనిచేస్తున్నారన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చిఅనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మండల సరిహద్దులో అవతల వైపు ఉన్న మహారాష్ట్రలో ఎన్నికలు జరగనున్న నేపధ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్‌మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని చెప్పారు. గ్రామాల్లోనియువత చెడు వ్యసనాలకు దూరం గా ఉంటూ క్రమ శిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య ఉం టే డయల్ 100కు కానీ పోలీసులకు కానీ సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, స్థానిక ఎస్ఐ శ్యామ్ పటేల్ పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా కొలవార్ జెండా పండుగ

కన్నెపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి మండల కేంద్రంలో ఆదివారం కొలవార్ జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఎగురవేశారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కొడిపె వెంకటేష్, చింతపూడి రాములు, వెంకటేష్, నాగులు, బాయక్క, రమేష్, భీమేష్, రాజేష్, అంజి, సాయి, మహేష్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భీమన్న జాతర

నెన్నెల, నవంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెగూడంలో భీమన్న జాతర కొనసాగు తోంది. నూతనంగా తయారు చేయించిన రథాలను సుందరంగా అలంకరించి ఆదివారం గ్రామంలో ఊరేగించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భీమదేవుడి గజాలకు పసుపు బండారుతో గిరిజన పూజారులు ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. రథాల ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు

అడవిపందుల దాడిలో పంట ధ్వంసం



అడవిపందుల దాడిలో ధ్వంసమైన వరి పంట

కాసిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అటవీ ప్రాంతంలో సాగు చేసిన పంటలపై అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. ముత్యంపల్లికి చెందిన రేషవేని ఓదెలు సోనాపూర్ అటవీ శివారు ప్రాంతంలో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. శనివారం రాత్రి మూడు ఎకరాల్లో పందుల గుంపు దాడి చేసి పంటను నాశనం చేశాయి. అలాగే తాటిగూడెంలో మడావి వెంకటేష్ ఇంటి సమీపంలో 5 ఎకరాల వరి పంట సాగు చేశాడు.శనివారం రాత్రి పొట్టదశలో ఉన్న పొలంలోకి వచ్చిన పందుల గుంపు ధ్వంసం చేశాయి. దీంతో చేతికంది వచ్చిన పంట నాశనం కావడంతో రైతు కన్నీరు మున్నీరయ్యాడు. డీఆర్‌వో ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ వన్య ప్రాణులకు ఎలాంటి హానీ తలపెట్టవద్దని, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చరిత్రకు సాక్ష్యంగా..

కంకాలమ్మ ఆలయం

- స్వయంభుగా వెలసిన అమ్మవారు
- వందల కాలం నాటి చరిత్ర

కౌటాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎత్తైన గుట్టపై ఉన్న కంకాలమ్మ దేవాలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. కోరిన కోరికలు తీర్చే కల్పతరువుగా కంకాలమ్మ కేతేశ్వర్లు పూజలందుకుంటున్నారు. వందల ఏళ్ల నాటి చరిత్రను కలిగిన ఈ ఆలయం దశాబ్దంగా అత్యంతవేగంగా ప్రాచూర్యం పొందుతోంది. అయితే దేశంలో కంకాలమ్మ కేతేశ్వరస్వామి ఆలయాలు రెండే ఉండగా స్వయంభుగా వెలిసిన ఆలయాల్లో కౌటాల కంకాలమ్మ క్షేత్రం మొదటిదిగా కాగా, కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గలో రెండో ఆలయం ఉంది. కానీ అది స్వయంభు కాకపోగా నిర్మితం జరిగింది కావడంతో స్వయంభుగా వెలిసిన కౌటాలక్షేత్రం మహత్యంపైనే భక్తులకు ప్రగాఢ విశ్వాసం. ప్రతియేడు కార్తీకమాసం చివరి ఆదివారం నాడు కౌటాల కంకాలమ్మ ఆలయ ప్రాంగణంలో మూడు రోజులపాటు నిర్వహించే జాతరకు రాష్ట్రంలోని భక్తులే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు.



నూతనంగా నిర్మించిన కంకాలమ్మ ఆలయం

కౌటాలే పుణ్యక్షేత్రం :

ఒకప్పటి కౌటారం గ్రామమే నేటి కౌటాలగా పిలువబడుతుంది. గతంలో కౌటాలనే ఓ పుణ్యక్షేత్రంగా కొలిచే వారని పెద్దలు చెప్పుతుంటారు. ఇందుకు నిదర్శణమే కౌటాల గ్రామంలో 300పైగా ఆలయాలు, బావులు ఉండేవని చెప్పుతుంటారు. దీనికి నిదర్శనమే గ్రామంలో ఇప్పటికీ చాలాచోట్ల పురాతన విగ్రహాలు బయటపడ దంతో పాటు పలు చోట్ల పూజలు అందుకుంటున్నాయి.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే మరింత అభివృద్ధి..

రాష్ట్రంలో కంకాలమ్మ గుట్టను పర్యాటక కేంద్రంగా గుర్తించి ఆలయ ప్రాంగణాన్ని అభివృద్ధి పరిస్తే మంచి పర్యాటకకేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయని భక్తులు పేర్కొంటున్నారు. ఈ ఆలయం ఎత్తైన గుట్టపై, చుట్టూ పచ్చనిచెట్లతో ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో ఉంటుంది. ఆలయంలో సంవత్సరం పొడవునా ప్రతినెల పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహిస్తారు. కార్తీకమాసంలో భక్తులు కంకాలమ్మ కేతేశ్వరస్వామి మాలలు ధరిస్తుంటారు. అలాగే కంకాలమ్మ ఆలయం చుట్టు గణపతి, ఎర్రపొచమ్మ, నాగదేవత, బాలాంజనేయుడు, నవగ్రహ ఆలయాలు ఉన్నాయి.



కంకలమ్మ విగ్రహం

ఆలయ చరిత్ర..

దశాబ్దాల క్రితం ఈ ఆలయ నిర్మాణాన్ని ఒకే రాత్రి రాక్షసులు నిర్మించినట్లు పూర్వీకులు చెబుతుంటారు. కాగా ఈ ఆలయ నిర్మాణానికి ఉపయోగించిన భారీ ఆకారంలోని రాళ్ల ఈ ప్రాంతంలో ఎక్కడ కనిపించవు. ఈ రాళ్లను కనీసం 20మంది కలిసి ఎత్తినా ఎత్తలేని పరిస్థితి ఉండగా ఆనాడు ఏ విధంగా ఈ ఆలయాన్ని నిర్మించారని ప్రతిఒక్కరి ఆలోచింప చేస్తాయి. ఆలయంలోని దేవతా విగ్రహాలను కొందరు దొంగలించుకుపోతుండగా మేదరి కులానికి చెందిన మేదరయ్య అనే వ్యక్తి అడ్డు తగలగా ఆ దొంగలు అతని శిరస్సు ఖండించినట్లు అనవాళ్లుగా అక్కడున్న విగ్రహాలను బట్టి తెలుస్తుంది. కాగా దొంగలించుకుపోయిన విగ్రహాలు లభించకపోయినా అమ్మవారి శక్తి ఇక్కడే ఉందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కంకాలమ్మ గిరిపై ఉన్న ఆలయం 2000సంవత్సరం నుంచి ప్రాచుర్యంలో ఉంది. అయితే కంకాలమ్మ కేతేశ్వర స్వామికి మొక్కులు సమర్పించి కోరికలు కోరుకున్నట్లయితే ఇట్టే నెరవేరుతాయని, ఈ ప్రాంతంలో వర్షాలు రాని సమయంలో ఆలయ వద్ద రైతులు, భక్తులు గుట్టపైకి ఎక్కి మొక్కితే చాలు గుట్ట దిగేలోపు వర్షాలు కురియడం భక్తుల ప్రగాఢ విశ్వాసానికి నిదర్శనం.

తాతల కాలం నాటి ఆలయం



మా చిన్నతనంలో పెద్దలతో కలిసి ఆలయానికి భాజాభజంత్రీలతో వెళ్లే వాళ్లం. ఈ ఆలయ నిర్మాణం తమ తాతలు పుట్టకముందే జరిగిందని, ఎప్పుడో రాక్షసులు నిర్మించి ఉంటారని పెద్దలు చెప్పేవారు. వర్షాలు రాకపోతే భాజభజంత్రీలతో గుట్టపైకి ఎక్కితే చాలు భారీవర్షం పడేది. ఇప్పటికీ ఆ ఆనవాయితీ కొనసాగుతోంది.

- నారాయణ గౌడ్, భక్తుడు

ఆలయ మహత్యం చాలా గొప్పది..



కంకాలమ్మ అమ్మవారు ఎంతో మహత్యం కలిగినది. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. కోరిన కోరికలు తప్పకుండా నెరవేరుతాయన్న ప్రగాఢ నమ్మకం భక్తుల్లో ఉంది. ప్రత్యేకరోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. స్థానికులతోపాటు దూరప్రాంతాల నుంచి కూడా భక్తులు ఇక్కడివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు.

-సుల్వ కనకయ్య, ఆలయ కమిటీ చైర్మన్

సమ్మెకాలపు ఒప్పందాన్ని అమలు చేయాలి

రెబ్బెన, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టుకార్మిక సంఘాల జేఏసీ, యాజమాన్యానికి 2022లో జరిగిన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగెఉపేందర్ డిమాండు చేశారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. సెప్టెంబరు2022 యూనియన్ నాయకులకు, సింగరేణి యాజమాన్యానికి ఒప్పందం జరిగిందన్నారు. ఈ ఒప్పందం ప్రకారం బెల్టు క్లీనింగ్, షెల్ పికింగ్, బ్లాస్టింగ్, వర్క్‌షాప్‌లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు సెమిస్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే కన్వేయర్స్ డ్రైవర్స్‌కు కోల్ శాంప్లింగ్, అండర్‌గ్రౌండ్ వర్కర్స్‌కు స్కిల్డ్‌వేతనాలు చెల్లించాలన్నారు. వీటిని యాజమాన్యం ఇంతవరకు పరిష్కరించటం లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం వెంటనే స్పందించి ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలన్నారు.

విద్యుత్‌తీగలు అమరిస్తే ప్రాణాలకే ముప్పు

సిర్పూర్(టి), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పంటచేనులు, పొలాల చుట్టూ వన్యప్రాణులను హతమార్చడానికి విద్యుత్‌తీగలు ఏర్పాటు చేయవద్దని ఎస్సై కమలాకర్ పేర్కొన్నారు. అలా చేస్తే ఒక్కోసారి అవి రైతుల ప్రాణాలకే ముప్పుగా మారతాయని అన్నారు. రైతులువారి పంటపొలాలు, చేనులకు విద్యుత్‌తీగలు అమర్చరాదన్నారు. అక్రమంగా విద్యుత్‌తీగలు అమర్చిన రైతులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

అనారోగ్యంతో కవి శ్రీరామోజు లక్ష్మీరాజయ్య మృతి



లక్ష్మీరాజయ్య(ఫైల్)

కాగజ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కవి శ్రీరామోజు లక్ష్మీరాజయ్య శనివారం రాత్రి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. లక్ష్మీరాజయ్య రచించన రచనలు, కవితలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చాయి. గతేడాది జీవనయానం పేరిట ఆత్మకధను రాశారు. వీటితోపాటు తెలంగాణ ఉద్యమంలో కూడా పలుపాటలు రాశారు. ఆయన రచించిన పుస్తకాలు చాలా ఆదరణ పొందాయి. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

చెక్ పోస్టు ప్రారంభం



చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య

సిర్పూర్(టి),నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దులోని దుబ్బగూడ వద్ద మార్కెట్‌కమిటీ చైర్మన్ దేవయ్య చెక్‌పోస్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించా లన్నారు. మహారాష్ట్ర నుంచి అక్రమంగా వడ్లు, పత్తివస్తే దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు. ఈ చెక్‌పోస్టుతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ కార్యదర్శి భాస్కర్, డైరెక్టర్‌లు సమీర్, రాంనాయక్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు

కెరమెరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు అన్నారు. ఆదివారం ఆయన కోటారి, గోయగాం, ధనోరా గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు భీంరావు, గ్రామస్థులు శంకర్, మారుతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాగజ్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల 1991-92ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యనభ్యసించిన తీరు తెన్నులు, పడిన ఇబ్బందులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న 1991-92ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

బస్టాండు లేక ప్రయాణికుల ఇబ్బందులు



రోడ్డుపైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

కెరమెరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బస్టాండు లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కెరమెరి నుంచి ప్రతినిత్యం అటు జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్‌కు, అలాగే గిరిజనుల ఐటీడీఏ కేంద్రం అయినటువంటి ఉట్నూర్, ఆదిలాబాద్ వైపు రాకపోకలు సాగిస్తుం టారు. బస్టాండు లేకపోవడం వల్ల ప్రయాణికులు హోటళ్ల, కిరాణ దుకాణాల ఎదుట నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెల కొంది. అలాగే మండలకేంద్రంలో సులభ్‌కాంప్లెక్స్ తాగునీటి వసతులు లేక మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలకేంద్రంలో బస్టాండు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికులకు భారంగా ఇన్‌కమ్‌టాక్స్

మందమర్రి టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఇన్‌కమ్ టాక్స్ భారంగా మారిందని హెచ్‌ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టాక్సుకు సంబంధించి తీర్మాణంచేసి తెలంగాణకు చెందిన ఎంపీలు పార్లమెంట్‌లో విషయాన్ని ప్రస్తావించాలన్నారు. శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఒకోకార్మికుడికి 50వేల నుంచిలక్ష రూపాయలు కట్ అవుతోందన్నారు. దేశ ప్రగతికి దోహదపడుతున్న ఈ టాక్సు కోసం కార్మికసంఘాలన్ని కూడా కలిసిపోరాడాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆయాగనుల, డిపార్టుమెంట్‌లవారీగా కార్మికుల సమ స్యల సాధనకోసం త్వరలో పోరుబాట పడతామన్నారు. కార్యక్రమంలో వెల్డి సుదర్శన్, సదానందం, థామస్, ముఖేష్, రామస్వామి పాల్గొన్నారు.



ఎన్నికల హామీలను అమలు చేయాలి

శ్రీరాంపూర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంగా గెలిచి పదినెలలు గడిచినా ఇచ్చిన హామీలపై ఏఐటీయూసీ ఏమాత్రం స్పందించడం లేదన్నారు. పెర్క్స్‌పై పన్ను రాయితీ, ఇతరసమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. స్ట్రక్చర్ సమావేశంతో సంబంధం లేకుండా టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు 2021లో ప్లేడేలు, పీహెచ్‌డీలపై ఆంక్షలు విధించారని, ఆ ఆంక్షలు ఎత్తివేసేందుకు ప్రస్తుత గుర్తింపుసంఘం ఏఐటీయూసీ స్ట్రక్చర్‌మీటింగ్ పేరిట సాకులు చెప్తూ తప్పించుకుంటున్నారని ఆరోపిం చారు. యూనియన్‌కు అనుకూలంగా యాజమాన్యం ఉన్నప్పటికీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయకపోవడం సరికాదన్నారు. వెంటనే ప్లేడేలు, పీహెచ్‌డీలపై ఆంక్షలు ఎత్తివేసి, స్ట్రక్చర్ సమావేశం ఏర్పాటుచేసి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

బదిలీపై వెళ్తున్న హెడ్‌కానిస్టేబుల్‌కు సన్మానం



కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఎస్సై, పోలీసు సిబ్బంది

పెంచికలపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మూడేళ్లపాటు పెంచికలపేట పోలీసుస్టేషన్‌లో సేవలందించి రామగుండం కమీషనరేట్‌కు బదిలీఅయిన హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తిని ఎస్సై కొమురయ్య సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎస్సై కొమురయ్య, ఏఎస్సై ప్రభాకర్, రైటర్‌సారయ్య, సిబ్బంది కొమురయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ కలవరం..

5వ పేజీ తరువాయి..

గుంజుతారు. అది కాక సిమ్ స్వాపింగ్ మోసం మరో పద్ధతి. మన సిమ్ కార్డు నేరగాళ్ల వద్ద అక్టివేట్ అవుతుంది. ఓటీపీ పంపుతారు. ఓపెన్ చేయగానే ఫోన్ నంబర్ ద్వారా అకౌంట్ నంబర్ తెలుసుకొని బ్యాంకు ఖాతాలోని డబ్బులు కాజేస్తారు. ఇంకో రకంలో వాట్సప్‌కు ఏపీకే ఫైల్ వస్తుంది. క్లిక్ చేయగానే మన నంబర్ హ్యాక్ అవుతుంది. హ్యాక్ అయిన నంబర్‌కు సంబంధిత వ్యక్తి బ్యాంకు ఖాతా అందులో ఉన్న డబ్బుల వివరాలు తెలుస్తాయి. దీంతో ఆ మొత్తాన్ని కాజేస్తారు.

● **ఇటీవల నమోదైన కేసులు..**

● మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు తన కుటుంబసభ్యుల్లో ఒకరికి ఆరోగ్యం బాగా లేక ఆర్థిక చేయూతకు ఫండ్ రైసింగ్ చేయగా చాలా మంది అతనికి సహాయం అందిస్తారు. ఈ విషయాన్ని పసిగట్టిన సైబర్ నేరగాళ్లు తాము ఓ స్వచ్ఛంద సంస్థ నుంచి కాల్ చేస్తున్నామని, వైద్య ఖర్చుల కోసం రూ.10లక్షల వరకు అందిస్తామంటూ ఆ బాధితుడికి కాల్ చేస్తారు. అందుకు ముందుగా రూ.40వేలు పంపించాలని కోరగా బాధితుడు ఫోన్ పే ద్వారా వారికి డబ్బులు పంపిస్తాడు. రూ.10లక్షలు రాకపోగా అతను చెల్లించిన రూ.40వేలు కూడా చోరీకి గురయ్యాయి.

● జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మ్యాట్రిమోని పేరుతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న భార్యభర్తల చేతిలో మోసానికి గురయ్యాడు. మ్యాట్రిమోని.కామ్ అనే వెబ్‌సైట్‌లో అందమైన అమ్మాయిల ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ రిక్వెస్ట్ చేయగా రూ.17లక్షలు మోసపోయిన ఘటన గత నెల 5వ తేదీన చోటుచేసు కుంది.

● హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడికి సైతం బాంబే పోలీసుల పేరుతో నేరగాళ్లు సైబర్ వల విసిరారు. యువకుడికి కాల్ చేస్తూ ఐసీఐసీఐ బ్యాంకులో రూ.25లక్షలు లోన్ తీసుకున్నారని, దానికి సంబంధించి వీడియో కాల్ మాట్లాడాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు, మూడు రోజులు వరుసగా కాల్స్ రాగా యువకుడు స్పందించక పోవడంతో గండం గడిచింది.

● మందమర్రి మండలంలోని చిర్రకుంటకు చెందిన ఓ వ్యక్తి వాట్సప్‌కు వచ్చిన ఏపీకే ఫైల్ క్లిక్ చేయడంతో అతను తన బ్యాంకు ఎకౌంట్ నుండి రూ.50వేలు పోగొట్టుకున్న సంఘటన ఇటీవల చోటుచేసుకుంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా యువత, ఐటీరంగ నిపుణులు, రిటైర్డ్ కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అధిక లాభాల కోసం షేర్ మార్కెట్‌లో పెట్టాలను కునేవారు వివిధ రకాల వెబ్‌సైట్లను చెక్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్న సంఘటనలు ఇటీవల వెలుగుచూస్తున్నాయి. లింకులను క్లిక్ చేస్తున్నప్పుడు దాని గురించి పూర్తిగా వివరాలు తెలుసుకోవడం మంచిది. సైబర్ నేరాల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు తరుచుగా సదస్సులను ఏర్పాటు చేస్తున్నాం. సైబర్ బాధితుల కోసం ప్రతీ పోలీస్ స్టేషన్‌లో సైబర్ వారియర్లను నియమించాం. ఈ మేరకు వారికి అవసరమైన శిక్షణ ఇస్తున్నాం. సైబర్ నేరాలకు గురైన పక్షంలో 1930కు డయల్ చేస్తే తక్షణ సహాయం లభిస్తుంది.

-వెంకటరమణ, సైబర్ క్రైమ్ ఏసీపీ

ఆలయాల్లో భక్తుల కార్తీక పూజలు



గూడెంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తులతో కార్తీక సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినంకావడంతో ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గూడెం ఆలయానికి చేరుకొని సత్యదేవుడిని దర్శించుకున్నారు. భక్తులు ప్రత్యేక కార్తీక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. 540 మంది శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు.

జన్నారం : కార్తీకమాసం సందర్భంగా ఆదివారం ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని రామాలయంలో మహిళలు దీపాలంకరణ చేశారు.



సింగరేణి రక్షణ వారోత్సవాల సందర్భంగా నాటకంలో షేక్ తాజుద్దీన్



చాకలి ఐలమ్మ నాటకంలో..

కార్మికవాడ నుంచి వెండి తెరకు..

ఆయన చిన్నతనం నుంచే నటనపై ఆసక్తి, గానంపై మక్కువ పెంచుకున్నాడు. తన ప్రతిభతో గుర్తింపు పొందాడు. గాయకుడు, నటుడు, డైరెక్టర్, రైటర్, ఇలా అన్ని విభాగాల్లో రాణిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు సింగరేణి ఉద్యోగి షేక్ తాజుద్దీన్.

● నటన, గానం, డెరెక్టర్‌గానూ రాణింపు ● కళాకారుడిగా షేక్ తాజుద్దీన్‌కు గుర్తింపు

శ్రీరాంపూర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లికి చెందిన షేక్ తాజుద్దీన్ తండ్రి జానీమియా మందమర్రిలో సింగరేణి కార్మికుడిగా పనిచేసేవారు. ఆయన 1996లో వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోగా, తాజుద్దీన్ సింగరేణిలో ఉద్యోగం పొందాడు. ఆర్కే న్యూటెక్ గనిలో బదిలీ ఫిల్లర్ కార్మికుడిగా చేరాడు. వివిధ గనుల్లో పనిచేశారు. ప్రస్తుతం శ్రీరాంపూర్ ఓసీపీలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా తాజుద్దీన్ మందమర్రిలోని సింగరేణి పాఠశాలలో పదోతరగతి వరకు చదువుకున్నాడు. ఆరో తరగతిలో ఉండగా నటనపై ఆసక్తితో పౌరాణిక నాటకంలో ఓ పాత్రను వేశాడు. ఆనాటి నుంచి నేటి వరకు నటనే ప్రాణంగా ముందుకు సాగుతున్నాడు.

● **క్రీడల్లోనూ రాణింపు..**

పాఠశాల స్థాయిలో 1988 నుంచి 1995 వరకు జూనియర్స్ విభాగంలో వాలీబాల్ క్రీడలో ప్రతిభ చాటాడు. యేటా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడల్లో రాణిస్తూ పతకాలు సాధించాడు. తెలంగాణ ఉద్యమంలోనూ పలు కార్యక్రమాలు చేపట్టాడు.

● **గాయంతో ఉద్యోగానికి దూరం..**

సింగరేణిలో ఉద్యోగం చేస్తున్న తాజుద్దీన్‌కు సంస్థ పక్షాన జాతీయ స్థాయిలో ఆ డిన ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా 1999లో మోకాలికి గాయమైంది. దీంతో సరిగా డ్యూటీకి వెళ్లకపోవడంతో 2002లో ఉద్యోగం నుంచి డిస్మిస్ అయ్యాడు. ఉద్యోగం లేదు. ఆదాయం రాదు. ఏం చేయాలా అని ఆలోచిస్తున్న సమయంలో తనకు వచ్చి ననటనను నమ్ముకున్నాడు. కుటుంబాన్ని వదిలి ఒంటరిగా 2003లో హైదరాబాద్‌కు చేరుకున్నాడు. అక్కడ చాలా కష్టాలను అనుభవించాడు. చివరకు మంచి అవకాశాలు వచ్చాయి. దీంతో వెనుతిరిగి చూడలేదు.

టీవీ సీరియల్స్‌లో..

ఆనాటి టీవీ సీరియల్స్ అయిన కురుక్షేత్రం, పద్మ వ్యూహం, ప్రియాంక, భార్యామణి, దేవీ భాగవతం, సంబరాల రాంబాబు, సత్య, వైశాలి వంటి వాటిల్లో నటించాడు. దర్శకులు, నిర్మాతలను మెప్పించాడు. కాగా టీవీ సీరియల్స్‌లో నటిస్తూనే సినిమాల వైపు తన దృష్టిని సారించాడు. అతడి కష్టానికి ఫలితంగా నవదీప్ హీరోగా నటించిన 'మొదటి సినిమా'లో కూచిపూడి వెంకట్‌అనే దర్శకుడు అవకాశం కల్పించి ప్రోత్సహించాడు. ఆ తరువాత శ్రీ, సరదా.. సరదాగా, సామాన్యుడు, స్టాలిన్, ఖతర్నాక్, ఎవడైతే నాకేంటి, పోరంబోకు, శ్రీ సత్యనారాయణ స్వామి, తదితర సినిమాల్లో అనేకపాత్రల్లో నటించాడు. ముఖ్యంగా చిరంజీవి స్టాలిన్ సినిమాల్లో కానిస్టేబుల్, రవితేజ ఖతర్నాక్‌లో జిమ్ బాయ్, పప్పు సినిమాలో డ్రైవర్‌గా అద్భుతంగా నటించి ప్రశంసలు అందుకున్నాడు. ప్రముఖ కమేడియన్ బ్రహ్మానందంతో పలుమార్లు ప్రశంసలు పొందాడు. అలా 2013 వరకు పదేళ్ల పాటు కొనసాగిన సీరియల్స్, సినిమా ప్రస్తానానికి కాస్త విరామం తీసుకోవాల్సి వచ్చింది. సింగరేణి ఉద్యోగం విషయమై అప్పటికే కోర్టులో ఉన్న కేసు కొలిక్కి వచ్చింది.

● **కోర్టు తీర్పుతో..**

కోర్టు తీర్పుతో 2014లో మళ్లీ సింగరేణిలో ఉద్యోగం పొందాడు. కానీ తనలో ఉన్న కళాకారుడు మాత్రం ఆగిపోలేదు. సింగరేణి యాజమాన్యం నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ తాజుద్దీన్ తన ప్రతిభను చూపుతున్నాడు. రక్షణ ఉత్సవాల సందర్భంగా నిర్మించే టెలి ఫిలిమ్స్‌కు రచయితగా, నటుడిగా ముందుకు వెళ్తున్నాడు. సింగరేణి డే, స్వాతంత్ర్య, గణతంత్ర, ఇతర అన్ని కార్యక్రమాల సందర్భంగా తనకు ఎంతో ఇష్టమైన పౌరాణిక, సామాజిక నాటకాలను రచిస్తూ, డైరెక్షన్ చేస్తూ, అందులో నటిస్తూ కార్మికులకు, కార్మిక కుటుంబాలకు మంచి సందేశాన్ని అంది స్తున్నాడు. సింగరేణి కళోత్సవాల సందర్భంగా గజల్స్, సోలో సాంగ్, ఇతర అంశాల్లో పాల్గొంటూ ప్రశంసలు, అభినందనలు, అవార్డులూ అందుకుంటున్నాడు.



శ్రీ సత్యనారాయణ స్వామి సినిమాలో..

కళామతల్లినే నమ్ముకున్నా..



చిన్నప్పటి నుంచి కళామతల్లినే నమ్ముకున్నా. నాకు నటనపై ఆసక్తి ఎక్కువ. అందుకే టీవీ, సినిమాల్లో నటిం చాను. ప్రస్తుతం సింగరేణి నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ ఏదో ఒక రూపంలో ప్రదర్శనలు ఇస్తుంటా ను. సింగరేణి యాజమాన్యం అన్ని విధాలా సహకరి స్తోంది. అధికారులు, యూనియన్ నాయకులు, సహచర ఉద్యోగులు ఎంతో ప్రోత్సాహం అందిస్తుండడం ఆనందంగా ఉంది.

- షేక్ తాజుద్దీన్, సింగరేణి ఉద్యోగి

న్యూస్ బాక్స్

క్రీడాకారులకు అభినందన

మంచిర్యాల అర్బన్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని నెల్లికుదురులో ఈ నెల 4, 5వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ స్కూల్ గేమ్స్ అండర్- 14, 17 విభాగాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారులు ప్రతిభ చాటి 48 పతకాలు సాధించిన క్రీడాకారులు ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారందరికి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసోసియేషన్ సెక్రటరి ఆవునూరి మహేష్‌ల ఆధ్వర్యంలో ఆటగాళ్లకు పతకాలు అందజేశారు.

విద్యార్థులు కళాశాలలో చేరాలి

బెల్లంపల్లిరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మూడో విడుతలో సీట్లు పొందిన విద్యార్థులు మంగళ వారంలోగా కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపెల్లి శంకర్, పీజీ సెంటర్ ఇన్‌చార్జీ మేడ తిరుపతి ఆదివారంఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమయ్యే కాకతీయ యూనివర్శిటీ పీజీ రెగ్యులర్ కోర్సుల కోసం మూడో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ. 800 అక్‌నాలెడ్జ్‌మెంట్ పేమెంట్ ఫీజు చెల్లించాలని సూచించారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌తో పాటు ఎంఏ ఇంగ్లీష్, ఎంకామ్ కోర్సుల్లో మూడో విడతలో విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు తెలిపారు. వీరు ఈ నెల 12లోగా ఒరిజినల్ ధ్రువీ కరణ పత్రాలతో హాజరు కావాలని చెప్పారు. వివరాలకు 9959269975 నంబరులో సంప్రదించాలని ఈసందర్బంగా ప్రిన్సిపాల్ శంకర్ సూచించారు.

జడ్జిలను సన్మానించిన బార్ అసోసియేషన్ నాయకులు

గర్మిళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఆదివారం కోర్టు నూతన భవనాల అధికారుల నివాసాల శంకుస్థాపనకు వచ్చిన చీఫ్ జస్టిస్, హైకోర్టు ఆఫ్ తెలంగాణ శ్రీ అలోక్ అరాదే, హైకోర్టు జడ్జి వేణుగోపాల్, ఇతర జడ్జిలను మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్, కోశాధికారిగా శ్రీనివాస్, సభ్యులు మనోహర్‌రావు, ప్రదీప్‌చంద్ర, సాగర్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అలాగే మంచిర్యాలలో శాశ్వత కోర్టు భవనం పనులు త్వరలో ప్రారంభించేలా చూడాలని కోరారు.

సాంకేతిక విద్యకు ప్రభుత్వం పెద్దపీట



ఐటీఐ భవనం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

నస్పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక సాంకేతిక విద్యాను అభివృద్ధి చేస్తూ యువతకు మెరుగైనా ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఎమ్మెల్యే కొక్కిరా ల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. నస్పూర్ పట్టణం 10వ వార్డులోని ప్రగతినగర్ కాలనీలో దాదాపు రూ. 4 కోట్ల పైగా వ్యయంతో చేపట్టనున్న ఉపాధి కల్పన శాఖ శిక్షణ, అధునాతన శిక్షణ కేంద్రం (ఐటిఐ) నూతన భవనాల నిర్మాణానికి ఆదివారం కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజా చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేసే ఐటీఐలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం జరుగుతుం దన్నారు. డిమాండ్ కలిగి న కోర్సులను ప్రవేశపెట్టడం వల్ల యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని నైపుణ్యంతో మెరుగైనా ఉపాధి సాధించాలన్నారు. కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు పారిశ్రామిక రంగంలో వివిధ రకాల కోర్సులను అందించి నైపుణ్యాన్ని పెంపొందిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, వైస్ చైర్మన్ రజిత, కౌన్సిలర్లు సీపతి సుమతి-మల్లేష్, అగల్ డూటీ రాజు, బోయ మల్లయ్య, బొద్దున సంధ్యారాణి, నాయకులు భూపతి శ్రీనివాస్, యశోద, తిరుపతి పాల్గొన్నారు.

సత్యదేవుడి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం..

దండేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయాన్ని తెలంగాణ అన్నవరం దేవస్థానంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం పక్కన రూ. 35 లక్షల దాతల విరాళాలతో నూతనంగా నిర్మించిన వ్రత కల్యాణ మండపాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే, కలెక్టర్, డీసీపీ, ఏసీపీ, ప్రజాప్రతినిధులకు ఆలయ అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్తీక పౌర్ణమి జాతరకు వేలాది మంది భక్తులు తరలి వస్తారని భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది వసతులు కల్పించాలని సూచించారు. కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, డీసీపీ భాస్కర్‌లు సత్యదేవుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్, వేద పండితులు అర్చకులు స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రఘుస్వామి, సంపత్ స్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్, తహసీల్దార్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణులకు హాని తలపెట్టవద్దు

కాసిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణులకు హాని తలపెట్టవద్దని డీఆర్‌వో ప్రవీణ్‌నాయక్ అన్నారు. ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలో పెద్దపులి సంచరిస్తున్న నేపధ్యంలో ఆదివారం అటవీ శాఖ అధికారులు అటవీ పరిసర గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. పెద్ద ధర్మారం, మామిడిగూడెం, గురువాపూర్, గోండుగూడ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో బెల్లంపల్లి డిప్యూటి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌నాయక్ మాట్లాడుతూ వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని ఏసీపీ రవికు మార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తిలక్ మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాల నుంచి వచ్చిన ఆటగాళ్లు క్రీడా స్ఫూర్తితో ఆడారని పేర్కొన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడా జట్లకు ట్రోఫీలను అందజేశారు. కాగా ఈ పోటీల్లో 10 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రథమ స్థానం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ద్వితీయ స్థానం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రథమ స్థానం, ఉమ్మడి మెదక్ జిల్లా ద్వితీయ స్థానం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తృతీయ స్థానంలో విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో సీఐలు దేవయ్య, కుమారస్వామి , పీడీ గంగా మోహన్, కన్వీనర్ స్వామి, చాంద్‌పాషా, రాజ్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించారు... అప్రోచ్ రోడ్డు వదిలేశారు

● జైపూర్-పెగడపల్లి గ్రామాల మధ్య పూర్తికాని పనులు
● రాకపోకలకు వాహనదారుల అవస్థలు



ఈదులవాగు వంతెన వద్ద పూర్తి చేయని అప్రోచ్ రోడ్డు

జైపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల మధ్య వాగుల అడ్డంకులను తొలగించి రవాణా సదుపాయం కల్పించాలన్న భావనతో ప్రభుత్వం వాగులపై వంతెనల నిర్మాణం చేపట్టింది. వంతెనల నిర్మాణంలో చూపిన శ్రద్ధ వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు పనులపై మాత్రం లేకుండా పోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని జైపూర్-పెగడపల్లి గ్రామాల మధ్య ఉన్న ఈదుల వాగుపై ఏడాది క్రితం రూ. 3కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం చేపట్టగా ఇరువైపులా అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేయలేదు.

● **ఏడాది కాలంగా..**

జైపూర్-పెగడపల్లి గ్రామాల మధ్య ఉన్న ఈదుల వాగుపై వంతెన నిర్మించి ఏడాది కావస్తోంది. వంతెన లేక ఎన్నోఏళ్లుగా పెగడపల్లి, గంగిపెల్లి, ఎల్కంటి, తదితర గ్రామాల ప్రజలు వర్షాకాలంలో అనేక ఇబ్బందులు పడేవారు. దీంతో గత ప్రభుత్వం రూ. 3 కోట్లు వెచ్చించి వంతెనను నిర్మించారు. అయితే బ్రిడ్జి కష్టాలు తొలగినా అప్రోచ్ రోడ్డు పనులు మాత్రం పూర్తి కాలేదు. దీంతో ఆయా గ్రామాల నుంచి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఎస్టీపీపీతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ప్రజలు, ఎస్టీపీపీ కార్మికులు ఈదులవాగుపై నిర్మించిన వంతెనపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు.

మొరం పోసి ఉండడం, కంకర తేలి ఉండడంతో రాత్రిపూట వెళ్లే వాహన దారులు, కార్మికులు ప్రమాదాల బారిన పడు తున్నారు. ముఖ్యంగా వంతెనకు ఇరు వైపులా మొరం పోసి వదిలివేయడంతో వర్షాకాలంలో బురదమయంగా మారి వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. ప్రస్తుతం వాహనాలు వెళ్లినప్పుడు లేచే దుమ్ముతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అప్రోచ్ రోడ్డు పనులను పూర్తి చేయాలని ఎస్టీపీపీ ప్రభావిత గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాధుడే లేడని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

కేంద్ర విధానాలను ప్రజలు తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో సహజ సంపదలు, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయడానికి బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, వీటిని తిప్పికొట్టేందుకు ప్రజలు సమర శీల పోరాటాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ కోరారు. సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడారు. సీపీఐ వంద సంవత్సరాలు డిసెంబరు 26తో పూర్తి చేసుకుంటున్న సందర్బంగా ఆవిర్భావ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆదివారం ఆవిర్భావ వేడుకలను దేశ వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జాతీయ పార్టీ నాయకత్వం సూచించిందన్నారు. ు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కలీందర్‌అలీఖాన్, రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, వెంకటస్వామి, చంద్రశేఖర్, పూర్ణిమ, రవి, శ్రీనివాస్, సమ్మయ్య, పోచన్న, దుర్గరాజ్, సమ్మయ్య. దేవవరం పాల్గొన్నారు.

కవ్వాల టైగర్ జోన్ అద్భుతం



కవ్వాలలో డైరెక్టర్ మంజూషమహజన్, స్లొవేకియా దేశ విద్యార్థులు

జన్నారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్ అద్భుతంగా ఉందని, అభయారణ్యంలో అడవితో పాటు వన్య ప్రాణులు, అందాలు ఆకర్షణీయంగా ఉన్నాయని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ , వృక్షశాస్త్రవేత్త డాక్టర్ మంజూషమహజన్ అన్నారు. ఆదివారం కవ్వాల టైగర్ జోన్‌లో స్లోవేకియా దేశానికి చెందిన విద్యార్థులతో పర్యటించారు. కవ్వాల టైగర్ జోన్‌లో ఉండే వృక్షజాతులు, వన్యప్రాణుల లక్షణాలు, వాటి జాతులు, తినే ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎఫ్ఆర్‌వో సుష్మారావు, స్థానిక అటవీశాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు నాయకుల సన్మానం

నస్పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులపై హత్యాచారాలు, రక్షణ (పోక్సో) చట్టం కేసుల విచారణను వేగవంతం చేయడానికి ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయ స్థానానికి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమాకమైన రాంబాబ్‌ను ఆదివారం నస్పూర్‌లో ఘనంగా సన్మానించారు. నేతకాని మహార్ సంఘం, తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా సన్మానాలు చేశారు. కార్యక్రమాల్లో నాయకులు సాంబయ్య, శంకర్, డి. శంకర్, సహదేవ్, కిష్టయ్య, దుర్గ దాస్, జయశంకర్, రాంమూర్తి, కొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ సమావేశం

గర్మిళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ ఆవరణలో కార్యదర్శి మహ్మద్ అధ్యక్షతన నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంచిర్యాల జిల్లా కార్యవర్గ చీఫ్ అడ్వైజర్‌గా ఎండీ కైజర్, అడ్వైజర్‌గా యూనిస్, రీజనల్ ప్రెసిడెంట్‌గా ఆయుబ్‌ఖాన్, రీజనల్ సెక్రటరీగా అబ్దుల్ కలీంను ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జావేద్, రీజనల్ ట్రెజరర్‌గా గౌస్ మొహినుద్దీన్ ఎన్నికయ్యారు. మంచిర్యాల డివిజన్ ప్రెసిటెండ్‌గా అఫ్జల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఖాజాఅలీ, డివిజనల్ సెక్రటరీగా రహీంఉద్దీన్, ట్రెజరర్‌గా నజీ ముద్దీన్‌ను ఎన్నుకున్నారు. బెల్లంపల్లి డివిజన్ ప్రెసిడెంట్‌గా అంజాద్‌బాష, సెక్రటరీగా ఇంతియాజుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాసిన్, ట్రెజరర్‌గా హఫీజ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.



అర్ధరాత్రి వేళ ఇంట్లోకి చొరబడి అందినకాడికి దోచుకోవడం, అడ్డొస్తే హతమార్చి సొత్తు కాజేయడం ఒకప్పుడు నేరగాళ్ల పంథా. జిల్లాలో ఈ దోపిడీలు, దొంగతనాల స్థానంలో సైబర్ నేరాలు పెరిగిపోవడం కలవరపెడుతోంది. ఆన్‌లైన్, సాంకేతికతను ఆధారంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు.

సైబర్ కలవరం

- చెలరేగుతున్న ఆన్‌లైన్ మోసగాళ్లు
- టెక్నాలజీని వినియోగించుకుని మోసం
- ఖాతాల్లో నుంచి క్షణాల్లో డబ్బులు మాయం
- అధికారుల పేరుతో బెదిరించి దోపిడీ
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

మంచిర్యాల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, సాంకేతికతను ఆధారంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు పెట్రేగిపోతున్నారు. అయాయకులు, మహిళలు, టెక్నాలజీపై అవగాహన లేని వారిని, డబ్బు అత్యవసరం ఉన్న వారిని టార్గెట్ చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. కేవలం నిరక్షరాస్యులే కాదు, విద్యావంతులు సైతం ఈ మోసాలకు బలవుతున్నారు. ఇటీవల ఈ సైబర్ మోసాల బారినపడ్డ చాలామంది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. సైబర్ మోసాలను అరికట్టేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ సైబర్ పోలీస్ స్టేషన్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినప్పటికీ నేరాలను కట్టడి చేయలేని స్థాయిలో విస్తరిస్తున్నాయి. సైబర్ పోలీస్ స్టేషన్లకు నిత్యం ఫిర్యాదులు అందడం షరామామూలైంది. ఫిర్యాదులు ఇస్తున్న బాధితుల్లో ఎక్కువ మంది లక్షల రూపాయలు మోసపోతున్న వారే ఉన్నారు. వారిలో చిరువ్యాపారుల నుంచి ఐటీ ఉద్యోగుల వరకు ఉండటం గమనార్హం.

● రోజుకో కొత్త రకం..

సైబర్ నేరగాళ్లు పలు రకాల మోసాలతో లక్షలు కాజేస్తున్నారు. ఆన్‌లైన్, సాంకేతికతను వాడు కుంటూ రోజుకో కొత్తరకం మోసాన్ని తెరపైకి తీసుకువస్తున్నారు. పెట్టిన పెట్టుబడికి రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశ చూపి లక్షలు కాజేస్తున్నారు. కొందరు ఫేక్ వెబ్‌సైట్లను సృష్టించి పలు ఫోన్ నంబర్లకు లింకులు పంపుతారు. పెట్టిన పెట్టుబడికి రెట్టింపు సంపాదించవచ్చనే భావనతో లింకుపై క్లిక్ చేస్తూ నిలువునా మోసపోతున్నారు. లింకు లాగిన్ అయ్యాక కొంత మొత్తం జమ చేయాలని మెసేజ్ వస్తుంది. ఆయా లాగిన్‌లలో నేరగాళ్లకు సంబంధించిన సభ్యులు ఉండి వారిలో ఒకరికి రెట్టింపు డబ్బులు వచ్చినట్లు చూపిస్తారు. అవి చూసిన సామాన్యులు డబ్బులు పంపుతారు. వచ్చిన కాడికి దండుకొని ఆపై వెబ్‌సైట్‌ను క్లోజ్ చేస్తారు. అలాగే మరికొందరు ధనిలోన్, ఇండియా బుల్స్ లోన్ పేరిట ఫేస్‌బుక్‌లో అడ్వర్టైజ్‌మెంట్ ఇస్తారు. అది చూసిన వారు లోన్‌కు ప్రయత్నించగానే ప్రాసెసింగ్ ఫీజు చెల్లించమంటారు. డబ్బులు చెల్లించాక ఫేక్ అకౌంట్ క్లోజ్ చేస్తారు. రూ.5లక్షల లోన్ కోసం రూ.3లక్షల వరకు రిటర్న్ చెల్లించిన బాధితులు కూడా ఉన్నారు. మరో కోణంలో ఫోన్ నంబర్లకు వీడియో కాల్ వస్తుంది. కాల్ లిఫ్ట్ చేయగానే న్యూడ్‌గా ఉన్న అమ్మాయి ఫొటో వస్తుంది. కాల్ కట్ చేసి అమ్మాయితో కూడిన కాలర్ ఫొటోను ట్యాగ్ చేసి గ్రూప్‌లలో పెడుతామని బ్లాక్ మేయిల్ చేస్తూ డబ్బులు..

మిగతా 7లో..

చరిత్రకు సాక్ష్యంగా.. కంకాలమ్మ ఆలయం

- దేశంలోనే మొదటి స్వయంభు ఆలయం
- వందల కాలం నాటి చరిత్ర

6లో



కంకాలమ్మ గుట్టపై ఉన్న పురాతన ఆలయం

కార్మికవాడ నుంచి వెండి తెరకు..

- నటన, గానం, దెరెక్టర్‌గానూ రాణింపు
- కళాకారుడిగా షేక్ తాజుద్దీన్‌కు గుర్తింపు

7లో



సరదా.. సరదాగా సినిమాలో షేక్ తాజుద్దీన్

మాలలు ఉద్యమానికి సిద్ధంగా ఉండాలి

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మందమర్రి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మాలలంతా భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధం కావాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. కరీంనగర్‌లో ఆదివారం ఎస్సీల ఐక్యతకు మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టిన పాదయాత్ర ఆదివారం మానకొండూరుకు చేరింది. ఈ యాత్రకు చెన్నూరు ఎమ్మెల్యే హాజరై పాద యాత్రలో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది మాలల ఉన్నారని చెప్పారు. డిసెంబరులో నిర్వహించే మాలల జాగో సభకు లక్షలాదిగా తరలి రావాలని ఆయన కోరారు. మాలల అభివృద్ధి కోసం తాను ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాలలు ఎక్కడ సభలు పెట్టినా హాజరవుతా నన్నారు. ప్రైవేటు పరిశ్రమల్లో కూడా రిజర్వేష న్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. జాతిపై జరుగుతున్న అన్యాయానికి ఎదురొడ్డి పోరాడాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

భీమారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఉత్సాహంగా గడిపారు. అప్పుడు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్ రావు, సత్యనారాయణరెడ్డి, శంకర్, స్వరూపరాణి, హైమావతి, పూర్వ విద్యార్థులు రాజలింగు, వెంకటస్వామి, మధుకర్, దేవదాస్, మల్లేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుల పెండింగ్‌సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఆదివారం ఆయన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ , పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేల ద్వారా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

చెన్నూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమగ్ర సర్వే పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. మండలం జిల్లా అదనపు కలెక్టర్ పరిశీలిం చారు. ఆయన మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతీ ఇంటిని సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీవో అజ్మత్ అలీ, ఎంఆర్‌ఐ రంజిత్, ఎన్యుమరేటర్ సరోజ పాల్గొన్నారు.

తాండూర్ : సర్వేపై అపోహలు పెట్టుకోకుండా ప్రజలందరు ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేకు సహకరించాలని మండల విద్యాధికారి మల్లేశం అన్నారు. ఆదివారం కిష్టంపేట గ్రామంలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు.

ముదిరాజ్ కమిటీ సభ్యులకు సన్మానం

భీమారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భీమారంలో ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఆదివారం సన్మానించారు. మండల కేంద్రంలో కుల సంఘం పెద్ద యాదగిరి ధర్మయ్య అధ్యక్షతన ఎన్నుకున్నారు. తెనుగువాడ పెద్దగా అన్నవేన సారయ్యను, యూత్ ప్రెసిడెంట్‌గా సుంకరి మహేష్, మానెగాడిగా పిట్టల రాజన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్టిస్టులను ఆదుకోవాలి

మంచిర్యాల, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ అదివారం మంచిర్యాల ఎమ్మెల్యేకు ఆర్టిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమను ఆదుకోవాలంటూ వినతి పత్రంలో కోరారు.

అల్పాహారం పంపిణీ

బెల్లంపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం పట్టణంలోని మార్కెట్ చౌరస్తా వద్ద అల్పాహారం పంపిణీ చేశారు. భవన నిర్మాణ కార్మికులు, నిరుపేద కూలీలు, ప్రయాణికులు 300 మందికి పైగా అల్పాహారం పంపిణీ చేశారు. ప్రతి ఆదివారం ఉదయం 8 గంటలకు అల్పాహారం పంపిణీ చేయడం జరుగుతుందని వాకర్స్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు రత్నం రాజన్న, రంగ రామన్న, నాగేష్‌కుమార్, జయరాంయాదవ్, శ్రీనివాస్, సత్తయ్య, రాజయ్య, సుకుమార్, నర్సింహులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష దీపోత్సవం

బెల్లంపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎంఎసీ క్రీడా మైదానంలో ఎమ్మెల్యే వినోద్ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష దీపోత్సవంకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేశామని, నియోజకవర్గంలోని మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

- జిల్లాలో 326 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం
- కలెక్టర్ కుమార్‌దీపక్

దండేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం, పత్తి కొనుగోలు చేయాల కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. మండలంలోని నంబాల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, కన్నెపల్లిలోని జిన్నింగు మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పత్తికి క్వింటాలుకు రూ. 7,521 ఇస్తుందని, 8 నుంచి 12 శాతం తేమ కలిగి ఉన్న పత్తిని కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులు గమనించాలన్నారు. జిల్లాలో 326 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకు వచ్చే సమయంలో నిబంధనలను పాటించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌక ర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని



నంబాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్‌దీప్ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

చెప్పారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు తూకం, తేమ యంత్రాలు, గన్నీ సంచులు, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే పత్తి రైతులు 8 నుంచి 12 శాతం తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చంద్, వైస్ చైర్మన్ ఆరీఫ్, మండల ప్రత్యేకాధికారి రవీంద ర్‌రెడ్డి, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో జాగర్లమూడి ప్రసాద్, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లానాయకులు గడ్డం త్రిమూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు రాజన్న, విజయ్, రాకేష్, జంగు, సీసీఐ అధికారులు పాల్గొన్నారు.

- కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

లక్షెట్టిపేటరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం విక్రయించి రైతులు లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం లక్షెట్టిపేట మండలం మోదెల గ్రామంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్‌లతో కలిసి కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. కార్యక్రమంలో లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలి

నెన్నెల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని పలువురు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం వారు సమావేశమయ్యారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమం త్రిగా ఉన్న సమయంలో ఆదర్శరైతులను నియమించారని చెప్పారు. రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేసినట్టు చెప్పారు. . అప్పట్లో తమను అకారణంగా తొలగించారని, ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకు న్నారు. అధ్యక్షుడిగా చేకూర్తి రాజిరెడ్డి (ఆవడం), ప్రధానకార్యదర్శిగా గజేందర్‌సింగ్ (ఘణపురం), గౌరవ అధ్య క్షుడిగా సుంకరి శ్రీనివాస్, ముఖ్య సలహాదారుగా దుర్గం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా టి. అరుణ్‌సింగ్, కోశాధికారిగా పర్శ మల్లేష్, కార్యదర్శిగా గడ్డం వెంటేశ్వర్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదర్శరైతు వ్యవస్థ పునరుద్ధరణకు నూతన కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.

పేద యువతి వివాహానికి చేయూత

జన్నారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమ్మానాన్న లేని నిరుపేద యువతి వివాహానికి పొనకల్ మాజీ సర్పంచు జక్కు భూమేష్ ఆర్థిక సహాయం అందించారు. పొనకల్ గ్రామానికి చెందిన శ్రీవాణికి వివాహం ఈ నెల 17న జరగనుంది. యువతి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న మాజీ సర్పంచు భూమేష్, దుమల్ల ఎల్లయ్యరెడ్డి, సాయి యువతికి కావాల్సిన మట్టెలు, పుస్తెలు కొంత నగదు అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు కుదురుపాక పవన్‌కళ్యాణ్, యూత్ గౌరవాధ్యక్షుడు మర్రిపెల్లి శేఖర్, రవి, దయాకర్, మల్లయ్య, సూర్యం, లచ్చన్న, సాయిసంజయ్, అక్షయ్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదానం

శ్రీరాంపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌కు చెందిన అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కొత్తరోడ్డులో ఉన్న భక్తాంజ నేయ స్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కార్యదర్శి బేతి తిరుమల రావు, జిల్లా అధ్యక్షుడు చుంచు రాజ్ కిరణ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రా రంభించారు. గురుస్వాములు కొండా శ్రీనివాస్, బొడ్డు లక్ష్మణ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అయ్యప్ప స్వామి భక్తులు, యువకులు 75 యూనిట్ల రక్తాన్ని అందించారు. సర్జరీ అవసరం ఉన్నవారి కోసం రక్తం సేకరించినట్లు అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు శివారెడ్డి తెలిపారు.